## క్లుప్తంగా

### డ్రైవర్లు డీజిల్‌ను ఆదా చేయాలి

**జగిత్యాల:** డ్రైవర్లు డీజిల్‌ను ఆదా చేయాలని జగిత్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన అన్నారు. మంగళవారం జగిత్యాల డిపోలో అత్యుత్తమ డ్రైవింగ్‌తో డీజిల్ ఆదా చేసిన బంగారయ్య, శ్రీనివాస్‌లను డిపో మేనేజర్ అభినందించారు. ప్రతి ఒక్క డ్రైవర్ డీజిల్ ఆదా చేస్తూ ప్రయాణికులకు మంచి ప్రయాణం కల్పించాలన్నారు.

### ఆర్టీసీ డ్రైవర్లకు ప్రశంస పత్రాలు

**కోరుట్ల రూరల్:** కోరుట్ల ఆర్టీసీ డిపోలో అధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లకు డిపో మేనేజర్ మనోహర్ మంగళవారం ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ మిగతా డ్రైవర్లు కూడా ఇందనం పొదుపుగా వినియోగించి ఆర్టీసీ డిపోను అభివృద్ధిలోకి తేవటంతో పాటు సంస్థ పురోగతికి కృషి చేయాలని సూచించారు. అత్యధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు బి.రాజస్వామి, ఏ.రాజారెడ్డి లకు ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

**కోరుట్లరూరల్:** పట్టణంలోని పద్మశాలీ భవనంలో లయన్స్‌క్లబ్‌ఆఫ్ కోరుట్ల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 224 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 54 మందికి మోతె బిందు ఉచిత శస్త్ర చికిత్స కోసం రేకుర్తి కంటి ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జీవన్ రెడ్డి, కార్యదర్శి లక్ష్మారెడ్డి, కోశాధికారి గంగాధర్, డిస్ట్రిక్ట్ సెకండ్ వైస్ గవర్నర్ చంద్ర ప్రకాశ్, రీజియన్ చైర్మన్ సురేశ్ బాబు, ఆడెపు మధు, అల్లాడి ప్రవీణ్, పోతని ప్రవీణ్‌పాల్గొన్నారు.

### బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సాధికారత బృందం

**రాయికల్:** మండలంలోని ఆలూరులో జిల్లా మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మహిళ సాధికారత బృందం సభ్యులు బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. లింగ వివక్షత, చైల్డ్ హెల్ప్‌లైన్, సఖీ సేవలపై వివరించారు. కార్యక్రమంలో విజయభాస్కర్, సభ్యులు గౌతమి, స్వప్న, శారద పాల్గొన్నారు.

### వయోవృద్ధులను విస్మరిస్తే చర్యలు



కొడుకులపై ఫిర్యాదు చేస్తున్న వృద్ధురాలు

**జగిత్యాల:** వయోవృద్ధులను విస్మరిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆర్డీవో మధుసూదన్ అన్నారు. మంగళవారం కొడుకులు, కోడళ్లు ఇంట్లోంచి కొట్టి గెంటేశారని సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన వెంకటవ్వ ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది. ఆర్డీవో మధుసూదన్ మాట్లాడుతూ తల్లిదండ్రుల బాధ్యత పిల్లలదేనని, లేకపోతే జైలుశిక్ష, జరిమానాలు తప్పవని హెచ్చరించారు. వెంటనే వారిపై పోషణ సంరక్షణ చట్టం సెక్షన్ 2 ప్రకారం కేసు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, విశ్వనాథం, ప్రకాశ్‌రావు, హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

**జగిత్యాల:** విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని జ్యోతి హైస్కూల్ డైరెక్టర్ హరిచరణ్‌రావు అన్నారు. మంగళవారం జ్యోతి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఈనెల 11 నుంచి 13 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్లలో జరిగిన జాతీయస్థాయి అండర్ 14, అండర్ 17 క్రికెట్ టోర్నమెంట్‌లో అత్యంత ప్రతిభ కనబర్చి సత్తా చాటారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఉంటేనే ఎంతో ముందుకెళ్తారని, భవిష్యత్‌లో మరిన్ని పోటీలు ఎదుర్కొగల మానసిక స్థైర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రావు, మౌనికరావు పాల్గొన్నారు.

# కేజ్‌వీల్స్‌తో రహదారుల ధ్వంసం

- పాడవుతున్న రోడ్లు
- కోట్లాది ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు
- వాహనదారులకు తప్పని ఇబ్బందులు



రహదారిపై వెళ్తున్న కేజ్‌వీల్స్ ట్రాక్టర్

**మల్లాపూర్:** గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఎన్ని వందల కోట్లు వెచ్చిస్తున్న ఫలితం ఉండడం లేదు. పట్టుమని రెండేళ్లు కూడా గడవకముందే రహదారులు నరకదారులుగా మారుతున్నాయి. వీటంతటికీ కారణం కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు.. రోడ్లపై యథేచ్ఛగా తిరగడంతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. దీంతో రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా పంటల సాగు సీజన్లు వానాకాలం, యాసంగిలలో పలు గ్రామాల్లో కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను రోడ్లపై నడుపుతుండడంతో ఆ రహదారులు కొన్ని నెలలకే పాడవుతున్నాయి.

మండలంలోని పలు మార్గాల్లో నిర్మల్–జగిత్యాల 61వ నంబర్ జాతీయ రహదారితో పాటు డబుల్ రోడ్లు, లింక్‌రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం సుమారు వందల కోట్లు మంజూరు చేసింది. కొన్ని మార్గాల్లో పనులు పూర్తవగా, మరికొన్ని మార్గాల్లో డబుల్ రోడ్డు, లింక్‌రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రహదారులపైనే కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు విచ్చలవిడిగా తిరుగుతుండడంతో రోడ్ల మధ్య పగుళ్లు ఏర్పడి దెబ్బతిన్నాయి. కొన్ని మార్గాల్లో రోడ్లు ధ్వంసమై కంకర తేలి ప్రయాణానికి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కేజ్‌వీల్స్ ట్రాక్టర్లతో రోడ్లపైకి రావడంతో గీతలు పడి ద్విచక్రవాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఇంత జరుగుతున్న ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

**కనిపించని చర్యలు...**

కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్డెక్కితే... నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు సదరు ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకోవాలి. కానీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో ట్రాక్టర్ల యజమానులు యథేచ్ఛగా కేజ్‌వీల్స్‌తో రోడ్లనే తిరుగుతున్నారు. ఇప్పటికైనా కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు.

### గ్రామాల్లో ప్రచారం చేయిస్తా



రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను నడిపితే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం. కేజ్‌వీల్స్‌కు పట్టీలు వేసుకుని ఉపయోగించుకోవాలి. కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను రోడ్లపై నడపొద్దని గ్రామాల్లో ప్రచారం చేయిస్తా.
– రాజు, ఎస్సై, మల్లాపూర్

### చర్యలు తీసుకుంటాం



కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లను తారురోడ్లపై నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బీటీ రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌తో నడుపుతూ కనిపిస్తే ట్రాక్టర్‌ను సీజ్ చేసి జరిమానా విధిస్తాం. రోడ్ల భద్రతకు అందరూ సహకరించాలి.
– రమేశ్ గౌడ్, తహసీల్దార్



### పొంచి ఉన్న ప్రమాదం..

**కొడిమ్యాల:** కొడిమ్యాల నుంచి నాచుపెల్లి వెళ్లే ప్రధాన రహదారిలో ఇటీవల కొత్తగా నిర్మించిన బ్రిడ్జి దగ్గర రోడ్డు మార్గాన్ని మార్చారు. ఈ మార్పులతో బ్రిడ్జి దాటి కొద్దిపాటి దూరంలో మలుపు వద్ద రహదారి అతి సమీపంలో ఉన్న వ్యవసాయ బావి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో బావి కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆధికారులు స్పందించి బావికి చుట్టూ రక్షణ గోడ, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు, సమీప గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

# ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



సభ్యత్వం స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

**జగిత్యాలటౌన్:** ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్పి విద్యాబోధనకు ఆటంకం కలిగించొద్దని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నరేందర్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం జగిత్యాల అర్బన్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తపస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఉపాధ్యాయులను ప్రతీ నిత్యం ఏదో ఒక కార్యక్రమం చేపట్టి రిపోర్టు అందించాలని పై అధికారులు ఆదేశిస్తుండటంతో విద్యాబోధనకు ఇబ్బంది కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా నాయకులు ప్రవీణ్‌రావు, గంగారెడ్డి, రాజేందర్, కట్ట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలి**

**ధర్మపురి:** పాఠశాలల్లో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేయాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినిపెల్లి ప్రసాద్‌రావు అన్నారు. తపస్ సభ్యత్వ నమోదులో భాగంగా మంగళవారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి తపస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర బాధ్యులు రొట్టె శ్రీనివాస్, పూర్ణచందర్, జిల్లా కార్యదర్శి కాశెట్టి రమేష్, ఉపాధ్యక్షుడు శీలం రాజేష్, మండల అధ్యక్షుడు కాశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**సారంగాపూర్:** ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని పీఆర్‌టీయూ (టీఎస్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గోవర్ధన ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని పాఠశాలలు, కస్తూర్బా బాలికల విద్యాలయంలో పీఆర్‌టియూ (టీఎస్) సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర బాధ్యులు తోట రాజేష్, వి. రాజగోపాల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, ఉమేష్, రాజనర్సయ్య, సుద్దాల శ్రీనివాస్,గోపి, నవీన్, నిర్మల, రజిత పాల్గొన్నారు.

### సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కొడిమ్యాల:** స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ ఆర్డినెన్స్ ఇవ్వడంతో కాంగ్రెస్ నాయకులు బుధవారం కొడిమ్యాల అంగడి బజార్‌లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణ, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కదారి మల్లేశం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గాజుల అజయ్, తాళ్లపల్లి అంజయ్య, చింటూ తదితరులు ఉన్నారు.

### కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

**కథలాపూర్:** కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కథలాపూర్ మండలానికి చెందిన బీజేపీ నేతలు ఎద్మల వినోద్‌రెడ్డి, గాంధారి శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం కరీంనగర్‌లో కలిశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరామని, మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

**ధర్నాకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు**

**కోరుట్ల రూరల్:** హైదరాబద్‌లోని ఇందిరా పార్క్ వద్ద బీఆర్‌ఎస్ మంగళవారం తలపెట్టిన మహా ధర్నాకు ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆదేశాలతో కోరుట్ల నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు తరలివెళ్లారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ చేసిన డిక్లరేషన్ మేరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించినట్లు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు.

**విద్యార్థులకు ఐడీ కార్డులు, టై–బెల్టులు పంపిణీ**

**ధర్మపురి:** పట్టణంలోని న్యూ హరిజనవాడలోని ప్రభుత్వ పీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు మంగళవారం రిటైర్డ్ ఎంఈవో మ్యాన రాజయ్య ఐడీ కార్డులు, టై–బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో సీతామహాలక్ష్మి, నాయకులు వేముల రాజేష్, హెచ్‌ఎంలు శ్రీనివాస్, కనకతార, రొట్టె సరిత పాల్గొన్నారు.

# ప్రతీ వ్యక్తిలో ప్రత్యేకమైన కళ ఉంటుంది



నైపుణ్యత దినోత్సవంలో విద్యార్థులు,టీచర్లు

**జగిత్యాల:** ప్రతి వ్యక్తిలో ప్రత్యేకమైన కళ ఉంటుందని, నూతనంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీపై యువత అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అలియా మక్సూద్ అన్నారు. కళాశాలలో మంగళవారం ప్రపంచ యువత నైపుణ్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తిలో ఓ నైపుణ్యం ఉంటుందని, దానిని వెలికి తీయాలన్నారు. చైల్డ్ మ్యారేజ్ ప్రాజెక్ట్ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ భూమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు తమలో దాగి ఉన్న నైపుణ్యాలను బయటకు తీసుకువస్తేనే దేశం సైతం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా బాధ్యుడు గణేశ్, చైల్డ్ లైన్ కౌన్సిలర్ మానస, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతిరెడ్డి, అధ్యాపకులు తిరుపతి, ఫాజియా, రిజ్వానా, మాధవి పాల్గొన్నారు.

# నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

**మల్లాపూర్:** నిజాం షుగర్ ఫ్యాక్టరీలను హామీ మేరకు తెరిపించాలని, లేనిపక్షంలో చెరుకు రైతులతో కలిసి బీజేపీ పార్టీ ఉద్యమిస్తుందని ఆపార్టీ మండల అధ్యక్షుడు గోపిడీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే చెరుకు రైతుల గోడును తీరుస్తామని, మూసివేసిన నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి నడిపిస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. పునరుద్ధరణ కమిటీ పేరుతో కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణే ఏకైక డిమాండ్‌తో బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 20న మల్లాపూర్‌లోని సోమేశ్వర కొండ నుంచి ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ వరకు పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు పందిరి నాగరాజు, బీజేపీ ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, ప్రధాన కార్యదర్శి గడ్డం నర్సారెడ్డి, నాయకులు గజ్జి శ్రీనివాస్, కాంతయ్యచారి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరాములపల్లిలో అరుదైన బొప్పాయి



**గొల్లపల్లి:** మండలంలోని శ్రీరాములపల్లి లో మాజీ ఎంపీటీసీ బోయపోతు గంగరాజం–లక్ష్మి దంపతుల జామ, బొప్పాయి తోటలో మంగళవారం అరుదైన బొప్పాయి కాయ కన్పించింది. విచిత్రంగా ఉండటంతో స్థానికులు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

## సంక్షిప్త వార్తలు

### డీఐవో ఆకస్మిక తనిఖీలు

**కొడిమ్యాల:** మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా ఇమ్యూనైజేషన్ ఆధికారి ఏ.శ్రీనివాస్ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఓపీ రిజిస్టర్, ఆస్పత్రి సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. గర్భిణులు, చిన్నారులకు ఇవ్వాల్సిన రోగనిరోధక ఇంజెక్షన్లు, వ్యాక్సిన్ల నిల్వలపై వివరాలు సేకరించారు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి, ఇటీవల పని చేయడానికి చేరిన వైద్యుడి ఎన్‌రోల్మెంట్ వివరాలపై ఆరా తీసినట్లు సమాచారం.

**కాలిగ్రఫీపై విద్యార్థులకు శిక్షణ**

**మల్యాల:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాలిగ్రఫీ నిపుణుడు గడ్డం శ్రీధర్ మంగళవారం విద్యార్థులకు చేతిరాతలో మెలకువలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కాలిగ్రఫీతో ఏకాగ్రత పెరుగుతుందని, పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించే అవకాశం ఉందన్నారు. అనంతరం మాదక ద్రవ్యాల వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరించి, మత్తుపదార్థాలతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇసుక టిప్పర్ల పట్టివేత

**కోరుట్ల రూరల్:** పట్టణ శివారులోని పెద్ద గుండు సమీపంలో మంగళవారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. కథలాపూర్ మండలం బొమ్మెన నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పెద్ద గుండు వద్ద వాహన తనిఖీల్లో బాగంగా రెవెన్యూ ఆర్‌ఐ ఎండీ అమర్ సమ్మద్ తో కలిసి పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. టిప్పర్ ఓనర్లు ఎస్‌కే హజీర్, దారంగుల వీరన్న, డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

**ఇసుక ట్రాక్టర్లు ..**

**కథలాపూర్:** మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ వినోద్, ఆర్‌ఐ నాగేశ్ మంగళవారం తెలిపారు. బొమ్మెన, పోసానిపేట గ్రామాల శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు కనిపించాయన్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పేర్కొన్నారు.

### సీసీరోడ్డు పనులకు భూమిపూజ

**కథలాపూర్:** మండలంలోని గంభీర్‌పూర్‌లో సీసీరోడ్డు పనులకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం భూమిపూజ చేశారు. అంబేడ్కర్ సంఘం భవనం నుంచి మెయిన్ రోడ్డు వరకు సీసీరోడ్డు కోసం ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10 లక్షలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంజూరు చేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్ జవ్వాజి చౌదరి, నాయకులు గంగాధర్, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**మంద కృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలి**

**సారంగాపూర్:** దివ్యాంగుల పింఛన్‌లను రూ. 6 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు, మంద కృష్ణ మాదిగ పాల్గొనే సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు బెజ్జంకి సతీష్ మాదిగ అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి మాట్లాడుతూ దివ్యాంగులకు ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం రూ. 6 వేలు పింఛన్ ఇస్తుందని, తెలంగాణలోనూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈ నెల 27న జగిత్యాలలో జరిగే సభకు మంద కృష్ణ వస్తున్నారని, ప్రజలు తరలిరావాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**జగిత్యాలరూరల్:** మండలంలోని పొరండ్ల, బాలపల్లి, కన్నాపూర్, కండ్లపల్లి, పెర్కపల్లి, హన్మాజీపేట గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

**పుణ్య క్షేత్రాలకు ఆర్టీసీ బస్సు**

**కోరుట్ల రూరల్:** పుణ్య క్షేత్రాల దర్శనం కోసం కోరుట్ల ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఎస్ ఆర్టీసీ టూర్ ప్యాకేజీలో భాగంగా యాదగిరిగుట్ట, సురేంద్రపురి,స్వర్ణగిరి పుణ్యక్షేత్రాలకు శుక్రవారం 18 వ తేదీ రాత్రి లగ్జరీ బస్సు బయలుదేరుతుందని తెలిపారు. ఒక్క రోజు యాత్ర కోసం ఒక్కరికి రూ. 1100 చార్జీ ఉంటుందన్నారు. యాత్రికులకు ఒక పూట భోజనం, రెండు పూటల టిఫిన్ అందిస్తామని పేర్కొన్నారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్లు 9963961503, 9440485576 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

**శ్రీకృష్ణ యాదవ సంఘం కార్యవర్గం ఏర్పాటు**

**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలం బాలపల్లిలో మంగళవారం శ్రీకృష్ణ యాదవ సంఘం గ్రామ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కడ లక్ష్మీరాజం, ఉపాధ్యక్షునిగా కడ మల్లేశం, కోశాధికారిగా బొడ్డు రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**పాఠశాలకు ఆర్‌వో వాటర్ ప్యూరిఫైడ్ వితరణ**

**సారంగాపూర్:** తమతో కలిసి చదివిన మిత్రుడు ప్రమాదవశాత్తు అకాల మరణం చెందడంతో మిత్రుడి జ్ఞాపకార్థం తోటి మిత్రులు తాము చదివిన పాఠశాలకు రూ. 30 వేల విలువ చేసే ప్యూరిఫైడ్ వాటర్ (ఆర్‌వో) ప్లాంట్‌ను ఎంఈవో బుగ్గారపు కిషోర్‌కు మంగళవారం అందజేశారు. 2009–10 సంవత్సరంలో సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదివిన నారపాక బలగిరి ఇటీవల మృతిచెందాడు. ఆయన జ్ఞాపకార్థం ఆయనతో చదివిన మిత్రులు ఆర్‌వో ప్లాంట్‌ను పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కిషోర్, మాజీ ప్రజాప్రతినిధులు రాంచంద్రారెడ్డి, గంగాధర్, రాజేందర్ రెడ్డి, ఆయన మిత్రబృందం సభ్యులు ఉపేందర్, వెంకటేష్, సుమన్, జంగం రవి తదితరులు పాల్గొన్నారు.

**ట్రాఫిక్ రద్దీ మళ్లింపు కోసం మరో దారి ఏర్పాటు**

**మల్యాల:** మండలం ముత్యంపేటలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు వై జంక్షన్ వద్ద స్వాగత తోరణం నుండి వెళ్లే వాహనాలు ఒకే దారి నుండి రాకపోకలు కొనసాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండడంతో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో అధికారులు చొరవ తీసుకుని, స్వాగత తోరణం పక్కన మట్టిపోసి, మరోదారి ఏర్పాటు చేశారు. దారి మధ్యలో బారికేడ్లు ఏర్పాటు చేసి, కొండగట్టు పార్కింగ్ స్థలం నుంచి బయటకు వెళ్లే నూతనంగా స్వాగత తోరణం పక్కన ఏర్పాటు చేసిన దారి వెళ్లేలా చర్యలు చేపట్టారు. ఆలయ ఈవో శ్రీకాంత్ రావు, అధికారులు వాహనాల రాకపోకలను పర్యవేక్షించారు.

**500 రేషన్ కార్డులు మంజూరు**

**కథలాపూర్:** మండలంలోని వివిధ గ్రామాలకు చెందినవారికి కొత్తగా 500 రేషన్‌కార్డులు మంజూరైనట్లు తహసీల్దార్ వినోద్ మంగళవారం తెలిపారు. ఇప్పటివరకు మీసేవా కేంద్రాల్లో 2,500 దరఖాస్తులు వచ్చాయని, దశలవారీగా క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామన్నారు. ఇప్పటివరకు కొత్తగా 500 రేషన్‌కార్డులు మంజూరు కాగా, మిగతా దరఖాస్తుదారులకు త్వరలోనే మంజూరవుతాయన్నారు.

### పాత్రికేయుల సమస్యలపై నిరంతర పోరాటం

**మేడిపల్లి:** పాత్రికేయుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తానని ఐజేయూ జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు అన్నారు. నూతనంగా ఎన్నికైన నూతన కమిటీని మేడిపల్లి మండల కార్యవర్గం ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ నిస్వార్థంగా సేవ చేస్తున్న పాత్రికేయులు ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, పాత్రికేయుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్యాంసుందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు తిరుకోల శ్యాంసుందర్, మండల కమిటీ సభ్యులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పోటీ పరీక్షల పుస్తకాలు

**కథలాపూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇంజినీరింగ్, మెడికల్ కోర్సుల ప్రవేశాల పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను కోరుట్లకు చెందిన బూస శశికుమార్, బూస కావ్య మంగళవారం అందించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరడానికి మంచి పుస్తకాలు చదవాలనే ఉద్దేశ్యంతో పోటీ పరీక్షల పుస్తకాలు అందించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం, వారి భవిష్యత్ కోసం పుస్తకాలు అందించిన దాతను లెక్చరర్లు అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అచ్యుత్‌రాజ్, లైబ్రేరియన్ రమేశ్, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

**పురోహితుడికి పురస్కారం**

**సారంగాపూర్:** మండలంలోని అర్పపల్లి గ్రామానికి చెందిన సజ్జనపు మహేందర్ ఆచార్యులకు తెలుగు వెలుగు మహానంది జాతీయ గౌరవ పురస్కారం అందించారు. ఏడు రాష్ట్రాలో విస్తరించి ఉన్న తెలుగు వెలుగు సాహితీ వేదిక హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ఈ పురస్కారాన్ని ప్రముఖుల చేతుల మీదుగా మహేందర్‌కు అందజేశారు. కాగ మహేందర్ అర్పపల్లిలో పౌరోహిత్యంతో పాటు, జ్యోతిష్య రంగంలో సేవలందిస్తున్నారు.

**సన్మానం**

**ఇబ్రహీంపట్నం:** మండలంలోని కేశాపూర్‌కు చెందిన రొట్టె కిషన్‌శర్మ అనే పురోహితుడు తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం అవార్డు అందుకోగా, మంగళవారం మెట్‌పల్లి గురుదత్త బ్రాహ్మణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో గురుదత్త బ్రాహ్మణ యువజన సేవాసంఘం అధ్యక్షుడు డీఎస్‌కే ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎన్. గిరిధర్, కార్యదర్శులు మోహనకృష్ణ, ఎస్.వంశీ, కోశాధికారి ఎస్. రవికుమార్, సభ్యులు పాల్గొన్నారు.